క్లుప్తంగా

సంపూర్ణ పారిశుధ్య పట్టణంగా తీర్చిదిద్దుదాం


ఫాగింగ్ చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

సుల్తానాబాద్: సంపూర్ణ పారిశుధ్య పట్టణంగా తీర్చిదిద్దేందుకు పట్టణ ప్రజలు సహకరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యం సునీత గౌడ్ అన్నారు. బుధవారం రాత్రి ఆటో ట్రాలీలో పలు కాలనీలలో పాగింగ్ యంత్రంతో స్ప్రే నిర్వహించారు. పారిశుధ్య కార్మికులు ట్రాలీలో వచ్చినప్పుడు వ్యర్థాలను వేయాలన్నారు. వ్యర్థాలను బయటవేయడం మూలంగా దోమలు తయారై పలు రకాల రోగాలువస్తాయని వివరించారు.డెంగ్యూ మలేరియా, ఏ ఇతర వ్యాధులు వ్యాప్తి చెందకుండా పారిశుధ్యం పట్ల ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలని కలెక్టర్‌కు వినతి


వినతిపత్రం ఇస్తున్న సర్పంచ్ వెంకటలక్ష్మి

సుల్తానాబాద్‌రూరల్: రూర్బన్ పథకం, ఈజీఎస్ పథకం కింద చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి పెండింగ్ బిల్లులను చెల్లించాలని కోరుతూ సుల్తానాబాద్ మండలం నారాయణరావుపల్లి సర్పంచ్ మొలుగురి వెంకటలక్ష్మి బుధవారం కలెక్టర్ సంగీత సత్యనారాయణ, డీఆర్‌డీవో శ్రీధర్‌లకు వినతి పత్రాన్ని అందించారు. గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టినా పూర్తి స్థాయిలో బిల్లులు రాక, అప్పులపాలవుతున్నామని సర్పంచ్ వేడుకున్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు సిబ్బంది జీతాలకు సరిపోక ఇబ్బందులు పడుతున్నామని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. త్వరలోనే బిల్లులు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారని పేర్కొన్నారు.

కార్మిక కుటుంబాలకు స్వచ్ఛమైన నీరందించాలి


వినతిపత్రం ఇస్తున్న బీఎంఎస్ నాయకులు

గోదావరిఖని: సింగరేణి కార్మిక కుటుంబాలకు స్వచ్ఛమైన నీరందించాలని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య కోరారు. బుధవారం డైరెక్టర్(పా) బలరాంను కలుసుకుని వినతిపత్రం అందజేశారు. వేలాది కుటుంబాలున్న కార్మిక క్షేత్రంలో స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మాధవనాయక్, పవన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలేదీక్షలు


రిలే దీక్షల్లో బీఎస్పీ నాయకులు

పెద్దపల్లిరూరల్: బీసీ గణన చేపట్టాలని, జనాభాకు అనుగుణంగా బీసీ రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్ చేస్తూ బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు బుధవారం నాటికి ఏడో రోజుకు చేరాయి. నియోజకవర్గ ఉపాధ్యక్షుడు నర్ల గోపాల్ దీక్ష ప్రారంభించారు. బీసీలంతా ఏకమై పోరాడి రిజర్వేషన్లను సాధించుకుందామన్నారు. కార్యక్రమంలో నాయకులు బాల కళ్యాణ్, శేషాద్రి, చంద్రమౌళి, రియాజ్, పాల్గొన్నారు.

'బీఎస్పీ నేతలను విమర్శించే అర్హత గువ్వలకు లేదు'

రామగిరి: బీఎస్పీ నేతలు మాయావతి, ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్‌ను విమర్శించే అర్హత ఎమ్మెల్యే గువ్వల బాలరాజుకు లేదని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి జనగామ రవికుమార్ అన్నారు. మండలంలోని కల్వచర్లలో బుధవారం మాట్లాడారు. మాయావతి ఉత్తరప్రదేశ్ సీఎంగా అన్నివర్గాల్లోని నిరుపేద ప్రజలకు 7లక్షలఎకరాల భూమిని చేసిన ఘనత ఆమేదని గుర్తు చేశారు. బాలరాజు ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకుని నోటిని అదుపులో పెట్టుకోవాలని లేకపోతే తెలంగాణ ప్రజలు కర్రుకాల్చి వాతలు పెడతారని హెచ్చరించారు. సమావేశంలో ఆ సంఘం నాయకులు నాగరాజు, సంపత్, పులిపాక బొందాలు, కొమ్ము, రాజేష్, బోంకురి అజయ్, గజ్జల సురేష్, సాగర్, రమేశ్, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

చి 'వరి'కి సాగునీరందేనా?

- శిథిలావస్థకు చేరిన కాలువలు, నిండిపోయిన చెత్తాచెదారం
- కాల్వల వెంట సాగునీటికి రైతుల శ్రమదానం
- వారబందీ పద్ధతిన ఎస్సారెస్పీ నీటి విడుదల


తూము వద్ద చెత్త తొలగిస్తున్న రైతులు


కాలువలో పేరుకుపోయిన చెత్తాచెదారం

రామగుండం: మండల పరిధిలో ఎల్లంపల్లి ప్రాజెక్టు ఉన్నా రైతులు యాసంగి సీజన్‌లో ఎస్సారెస్పీ నీటి పైనే ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. కాలం చెల్లిన ఎస్సారెస్పీ కాల్వలకు కూలిన లైనింగ్‌లు, పగిలిపోయిన ఫ్లోరింగ్స్, పలుచోట్ల గండ్లు పడిన ప్రదేశాలను గుర్తించి తాత్కాలిక పునరుద్ధరణ పనులు చేపడితేనే చి'వరి' టేలాండ్ భూములకు సాగునీరు అందనుంది. జనవరి 15వ తేదీ నుంచి యాసంగి సీజన్‌కు వారబందీ పద్ధతిలో ఎస్సారెస్పీ నీటిని విడుదల చేశారు. రెండో విడత మంగళవారం రాత్రి అంతర్గాం మండల పరిధిలోని పలు కాలువలకు నీరు చేరగా కాలువలలో పేరుకుపోయిన చెత్తా, చెదారంతో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీంతో ఉపాధి హామీలో చెత్తా, చెదారం, పిచ్చి మొక్కలు తొలగిస్తూ సాగునీటి సరఫరాను మెరుగు పరుచుకుంటున్నారు. ప్రధాన కెనాల్ డీ–83 నుంచి 27/ఎల్ మీదుగా ఉమ్మడి రామగుండం మండల పరిధిలో (అంతర్గాం, పాలకుర్తి) కెనాల్స్ కింద ఉన్న సుమారు 15 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరందనుంది.

ఎస్సారెస్పీ వరద నీటి సరఫరా ఇలా....

పెద్దపల్లి మండల పరిధిలోని అప్పన్నపేట వరకు ప్రధాన కాలువ డీ–83 కింద ఉప కాలువ 27/ఎల్ ద్వారా అంతర్గాం, పాలకుర్తి మండలాల పరిధిలోని 24 గ్రామాలకు కెనాళ్లకు సాగు నీరందనుంది. ఇందులో పాలకుర్తి పరిధిలోని 1ఎల్ కాలువ నుంచి రాగినేడు, ఈసాల తక్కళ్లపల్లి, 2ఆర్ కాలువ నుంచి బ్రాహ్మణపల్లి, మర్రిపల్లి, రాయదండి, గోలివాడ, అంతర్గాం టేలాండ్ (చివరి)వరకు, 3ఆర్ కాలువ నుంచి ఆకెనపల్లి, బ్రాహ్మణపల్లి, సోమనపల్లి, ముర్మూర్ చివరి వరకు, 4ఆర్ కాలువ నుంచి ఆకెనపల్లి చివరి వరకు, 5ఆర్ ఎగ్లాస్‌పూర్, ఆకెనపల్లి, సోమనపల్లి, పొట్యాల చివరి భూములకు, 6ఆర్ ఎగ్లాస్‌పూర్, పొట్యాల చివరి వరకు, 7ఆర్ పొట్యాల చివరి వరకు, 8ఎల్ మద్దిర్యాల వరకు, 9, 10 ఎల్ కాలువలు మద్దిర్యాల పునరావాస కాలనీలో ముంపునకు గురయ్యాయి.

కాలువలు శుభ్రం చేయించాలి



ఐదెకరాల వ్యవసాయ భూమిలో వరి సాగు చేసుకుంటాను. మా ఊరు శివారులో అట్లకుంట చెరువు నింపితే భూగర్భ జలాలు పైకి వస్తాయి. ప్రతీ యాసంగి సీజన్‌లో ఎస్సారెస్పీ నీళ్లు వచ్చినప్పుడు చెరువులోకి నీరు చేరుతుంది. కాలువలు పూర్తిగా చెత్తా చెదారంతో నిండిపోవడంతో చివరి పొలాలకు సాగునీరు అందడం లేదు. అధికారులు స్పందించి కాలువలు శుభ్రం చేసి చివరి పొలాల రైతులను ఆదుకోవాలి.

– రాజ్‌కుమార్, ఎగ్లాస్‌పూర్, రైతు.

చెత్తాచెదారాన్ని తొలగిస్తున్నాం



మండల పరిధిలోని గ్రామాల వారీగా ఉన్న ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు తమ పరిధిలో ఉన్న ఎస్సారెస్పీ కాలువలో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని తొలగిస్తూ నీటి సరఫరాను మెరుగుపరుచుతున్నారు. గ్రామాల్లో కాల్వలపై ప్రతీ వంతెన కింద చెత్తా చెదారం నిండిపోవడంతో నీటి సరఫరాకు అడ్డుకట్ట పడుతుంది. స్థానిక రైతుల సహకారంతో చెత్తను తొలగించి రైతులకు సహకరిస్తున్నాం.

– బర్పటి సురేశ్, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్

ప్రజా సమస్యలు పరిష్కరించడమే లక్ష్యం

- ఎమ్మెల్యే కోరుకంటి చందర్


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

జ్యోతినగర్: ప్రజా సమస్యలు తెలుసుకుని వాటిని వెనువెంటనే పరిష్కరించడం పాలకుల కర్తవ్యమని, రామగుండం కార్పొరేషన్ అభివృద్ధే ధ్యేయంగా పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. బుధవారం ఎన్టీపీసీ రామగుండం ఎఫ్‌సీఐ క్రాస్‌రోడ్‌లో రూ.2 కోట్ల రూపాయలతో చేపట్టనున్న రోడ్డు వెడల్పు పనులను, రూ.పది లక్షలతో 24వ డివిజన్ అభివృద్ధి పనులకు ఆయన డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావు, కార్పొరేటర్ కొలిపాక సుజాతతో కలిసి శంకుస్థాపన చేశారు. పట్టణాల అభివృద్ధి కోసమే సీఎం కేసీఆర్ పట్టణప్రగతి నిధులను ప్రత్యేకంగా కేటాయించి అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. పదేళ్లలో జరగని అభివృద్ధి కేవలం నాలుగేళ్లలో చిత్తశుద్ధితో నిధులను కేటాయించి అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కలవ్వర్ల కృష్ణవేణి, ఎన్వీ రమణారెడ్డి, నాయకులు, మున్సిపల్ సిబ్బంది, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

ఎన్టీపీసీ ప్రెస్‌భవన్‌కు భూమిపూజ

ఎన్టీపీసీ రామగుండం ప్రాంతంలో నిర్మించనున్న ఎన్టీపీసీ–ప్రెస్ భవన్‌కు ఎమ్మెల్యే కోరుకంటి చందర్ కొబ్బరికాయ కొట్టి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో డిప్యూటి మేయర్ అభిషేక్‌రావు, గోదావరిఖని ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వంశీ, కార్పొరేటర్లు, మున్సిపల్ కమిషనర్ సుమన్‌రావు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేసిన మంత్రికి ఎమ్మెల్యే కృతజ్ఞతలు

మంథని: నియోజకవర్గంలోని మంథని, రామగిరి, ముత్తారం, కమాన్‌పూర్, పాలకుర్తి మండలాల్లో పంచాయతీ రాజ్ శాఖ నుంచి నూతనంగా సీసీ రోడ్లు, మరుగుదొడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుకు మంథని ఎమ్మెల్యే శ్రీధర్ బాబు కృతజ్ఞతలు తెలిపారు. ఐదు మండలాలకుగాను రూ.9 కోట్ల 48 లక్షలు, అలాగే ముత్తారం మండలం బగుళ్లగుట్ట వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి చాలా మార్లు మంత్రి కోరగా రూ. 2కోట్ల 50 లక్షలు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు.

పల్లెల అభివృద్ధికి ఉపాధి నిధులు

కాల్వశ్రీరాంపూర్: పల్లెల అభివృద్ధికి ఉపాధి హామీ నిధులు మంజూరైనట్లు ఎంపీపీ నూనేటి సంపత్ యాదవ్, జెడ్పీటీసీ వంగళ తిరుపతి రెడ్డి తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల్లో సీసీరోడ్లు నిర్మాణానికి 2.69 కోట్లు మంజూరైనట్లు పేర్కొన్నారు. నిధుల మంజూరు చేయించిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో ఎంపీడీవో రామ్మోహన్ రావు, ఎంపీవో గోవర్ధన్, సూపరింటెండెంట్ సురేశ్, ఎంపీటీసీలు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మాయ మాటలు నమ్మి మోసపోవద్దు

- ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే దాసరి

ఎలిగేడు: మాయ మాటలు చెప్పే నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దని ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి అన్నారు. బుధవారం ఎలిగేడు మండల పరిషత్ కార్యాలయంలో లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేసి మాట్లాడారు. కొందరు నాయకులు అసత్య ప్రచారాలు చేస్తూ పబ్బం గడుపుకునేందుకు చూస్తున్నారని, వారి మాటలు నమ్మి మోసపోవద్దని కోరారు. రాష్ట్రంలో ఆడబిడ్డల పెళ్లి ఖర్చులకోసం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ అందిస్తున్నారని, దేశంలో ఇటువంటి పథకం లేదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ తానుపర్తి స్రవంతి జెడ్పీ వైస్ చైర్మన్ రేణుక, సర్పంచులు,ఎంపీటీసీలు ఎంపీడీవో శ్రీనివాసమూర్తి ,తహసీల్దార్ నాగరాజమ్మ, నాయకులు పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తి పెంపొందించుకోవాలి

పెద్దపల్లిరూరల్: యువత క్రీడాస్ఫూర్తి పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. పెద్దపల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీ మైదానంలో బుధవారం కేసీఆర్ కప్ క్రికెట్ పోటీలను ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మమతారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు ఉప్పు రాజ్‌కుమార్, శ్రీనివాస్, మొబిన్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

'విభజన హామీలు విస్మరించారు'

మంథని: కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కొత్తదనం ఏమీ లేదని, విభజన చట్టంలోని హామీలను విస్మరించారని కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర కో–ఆర్డినేటర్ శశిభూషణ్ కాచే విమర్శించారు. ఖాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ కేటాయింపులు లేవని, కాంగ్రెస్ హయాంలో నెలకొల్పిన ప్రభుత్వరంగ సంస్థల్లో వాటాల విక్రయం ద్వారా వచ్చిన సొమ్ముతో పథకాలు రూపొందించారన్నారు.

పంటపొలాలు పరిశీలన

రామగిరి: మండల కేంద్రమైన ముత్తారం శివారులోని వరి పంటపొలాల్లో కాండం తొలుచు పురుగు ఆశించినట్లు మండల వ్యవసాయ అధికారి చిందం శ్రీకాంత్ తెలిపారు. వరి పంటపొలాలను బుధవారం ఆయన పరిశీలించారు. కాండం తొలుచు పురుగు సోకిన వరిలో లార్వా కాండం కింది భాగంలో ఆశించడంతో మొక్క మొగి చనిపోతుందని తెలిపారు. దీని నివారణకు ఎకరం పొలానికి 10 కిలోల కార్బోఫ్యురాన్ గుళికలు లేదా 4 కిలోల క్లోరాంత్రీనిలిప్రోల్ లేదా లీటర్ నీటిలో 2మిల్లీ లీటర్ల క్లోరోపైరిఫాస్ లేదా లీటర్ నీటిలో రెండు గ్రాముల కార్టప్ హైడ్రో క్లోరైడ్ కలిపి పిచికారి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో శ్రీలేఖ, రైతులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా అడ్డుకున్న గ్రామస్తులు


ఇసుక రవాణాను అడ్డుకుంటున్న గ్రామస్తులు

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని కిష్టంపేటలో మానేరు నుంచి అక్రమంగా తరలిస్తున్న ఇసుక రవాణాను గ్రామస్తులు బుధవారం అడ్డుకున్నారు. మానేరునదిలో జేసీబీతో ఇసుకను తవ్వుతూ భారీ వాహనాల్లో ఇసుకను తరలిస్తున్న వాహనాలను సర్పంచు కాసర్ల తిరుపతి రెడ్డి, వార్డు సభ్యులు, గ్రామస్తులు అడ్డుకున్నారు. ఏలాంటి అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తున్నా మైనింగ్ అధికారులు పట్టించుకోక పోవడం విడ్డూరంగా ఉందని సర్పంచ్ అన్నారు. ఆరోపించారు. మానేరు నదిలో ఇసుక తవ్వకాలు నిలిపి వేయాలని ఎన్జీటీ ఆదేశాలిచ్చినప్పటికీ ఓ కాంట్రాక్టర్ యథేచ్ఛగా ఇసుకను భారీ వాహనాల్లో తరలించడంపై విమర్శలు వస్తున్నాయి. మైనింగ్ అధికారులు ముడుపులు తీసుకుని చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారా అని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాను నిలిపివేయాలని కోరారు.

బీఆర్‌ఎస్‌కు అంతిమ ఘడియలు


మాట్లాడుతున్న ఉష

పెద్దపల్లిరూరల్: బహుజనులను ఏకం చేసేందుకు ప్రజల్లో చైతన్యం పెంచుతూ...వారి ఆదరాభిమానాలను పొందుతున్న బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ పై బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు చేసిన ఆరోపణలు అసత్యమని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష అన్నారు. జిల్లా పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ నాయకులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని ఆరోపించారు. ప్రవీణ్‌కుమార్ పై నిరాధార ఆరోపణలు చేసిన బాలరాజు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు బాల కళ్యాణ్ పంజా, శేఖర్, శేషాద్రి, స్వప్న, గోపాల్, రియాజ్, సాగర్ తదితరులున్నారు.

సమ్మక్క–సారలమ్మకు బోనాలు


సమ్మక్క–సారలమ్మలకు బోనాలు సమర్పిస్తున్న భక్తులు

జూలపల్లి: మండలంలోని అబ్బాపూర్‌లో పోచమ్మ గుట్టపై వెలసిన సమ్మక్క సారలమ్మలకు జాతర కమిటీ ఆధ్వర్యంలో బోనాలు సమర్పించారు. జాతర నిర్వహించి ఏడాది గడచిన సందర్భంగా తిరుగు బోనంలో భాగంగా బుధవారం అమ్మవార్లకు నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో జాతర కమిటీ అధ్యక్షుడు పసునూటి శ్రీనివాస్,ఉపాధ్యక్షుడు జంగిలి లచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు.

శ్రీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం


పూజలు చేస్తున్న అర్చకులు

కాల్వశ్రీరాంపూర్: మండల కేంద్రంలోని హరిహర క్షేత్రంలో శ్రీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం గణపతి పూజతో ప్రారంభమై ప్రత్యేక పూజలు తీర్థప్రసాద వితరణ చేశారు. హైకోర్టు న్యాయవాది యెరబాటి అశోక్ రావు సుమిత దంపతులు హోమం నిర్వహించారు. కార్యక్రమంలో అలయ వ్యవస్థాపకులు యెరబాటి రాజేశ్వర్ రావు, వేదండితులు ప్రవీణ్ శర్మ, రఘునాథ శర్మ, సాయివిశాల్ శర్మ, అరవింద్ శర్మ పూజా కార్యక్రమాలు జరిపించగా, నిర్వాహకులు అన్నదానం చేశారు.

జెడ్పీటీసీ దిష్టిబొమ్మ దహనం


దిష్టిబొమ్మ దహనం చేస్తున్న ఏబీవీపీ నాయకులు

సుల్తానాబాద్: ఇల్లంతకుంట జెడ్పీటీసీ సిద్ధం వేణు దిష్టిబొమ్మను మండల కేంద్రంలో బుధవారం ఏబీవీపీ నాయకులు దహనం చేశారు. ఏబీవీపీ జిల్లా కన్వీనర్ రాసూరి ప్రవీణ్ మాట్లాడుతూ మంత్రి కేటీఆర్ పర్యటనలో సిద్ధం వేణు ఏబీవీపీ నాయకులను కాలు బూటుతో తన్నారని, ఆయన విద్యార్థులకు క్షమాపణ చెప్పే వరకు ఆందోళన విరమించేది లేదన్నారు. ప్రశ్నిస్తే దాడులు చేయడం సరికాదన్నారు. పోలీసులు సిద్ధం వేణుపై వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వేల్పుల నాగ చంద్ర,విష్ణు భక్తుల రిషి, నగర కార్యదర్శి వేల్పుల నితిన్ నగర ఉపాధ్యక్షులు అమరగాని శ్రీనివాస్ నగర సంయుక్త కార్యదర్శి రోహిత్ నాయకులు అభి, నాగరాజు,తారక్, అరవింద్,విజయ్, తదితరులు పాల్గొన్నారు.

24గంటల ఉచిత విద్యుత్ ఉత్తమాటే


సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

పాలకుర్తి: రైతులకు 24గంటల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని టీఆర్‌ఎస్ ప్రభుత్వం, నాయకులు చెబుతున్న మాటలు ఉత్తమాటలేనని, రైతులకు కనీసం పదిగంటల నాణ్యమైన విద్యుత్ కూడా అందడం లేదని బీజేపీ నాయకుడు చందుపట్ల సునీల్ రెడ్డి అన్నారు. బుధవారం పాలకుర్తి మండలం కన్నాల విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట బీజేపీ నాయకులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సునీల్‌రెడ్డి మాట్లాడుతూ పేదల ప్రభుత్వం అని చెప్పుకునే టీఆర్‌ఎస్ పార్టీ విద్యుత్, ఆర్టీసీ, రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచి పేదల నడ్డివిరిచి పెద్దలకు దోచిపెడుతున్నదని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ ఏసీడీ చార్జీలను రద్దుచేసి పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. అనంతరం కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో తొగరి తిరుపతి, కంకటి శ్రీనివాస్, పీసర్ల లక్ష్మణ్‌రావు, బుర్ర సదిగౌడ్, గండికోట బొబ్బిలిరాజ్, మల్క సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కంటివెలుగు శిబిరాలు


వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ సుమన్‌రావు

జ్యోతినగర్: ప్రతీ ఒక్కరికి కంటి చూపు చక్కగా ఉండాలని ప్రభుత్వం కంటివెలుగు ప్రారంభించిందని రామగుండం మున్సిపల్ కమిషనర్ సుమన్‌రావు అన్నారు. బుధవారం ఐదో డివిజన్‌లో కంటి లుగు నేత్ర వైద్య శిబిరాన్ని కార్పొరేటర్ కృష్ణవేణితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఎన్వీ రమణారెడ్డి, డాక్టర్ శ్రీవాణి, ఏఎన్ఎం భాగ్యలక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్ సరస్వతి,సిబ్బంది పాల్గొన్నారు.

జూలపల్లి: కంటి సమస్యలు ఉన్న వారు పరీక్షలు చేయించుకోని అద్దాలు తీసుకోవాలని ఎంపీడీవో వేణుగోపాలరావు సూచించారు. మండల కేంద్రంతో పాటు కుమ్మరికుంటలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు వైద్య శిబిరాలను వైద్యాధికారి సంపత్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఆయన వెంట సీహెచ్‌వో కలిమొద్దీన్, హెచ్ఎస్ వసంత, సిబ్బంది ఉన్నారు.

సుల్తానాబాద్: అందత్వాన్ని నిర్మూలించడమే ప్రభుత్వ లక్ష్యమని మున్సిపల్ చైర్ పర్సన్ ముత్యం సునీత అన్నారు. బుధవారం సుల్తానాబాద్ లో కంటివెలుగును మూడో వార్డులో ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ నిషాద్ రఫీక్, కో–ఆప్షన్ సభ్యులు సయ్యద్ సాజిద్, మెడికల్ క్యాంపు డాక్టర్ శ్రీజ, సిబ్బంది పాల్గొన్నారు

ఓదెల: మండలంలోని ఓదెల, కొలనూర్ కంటివెలుగు శిబిరాలను ఓదెల ఎంపీడీవో జి సత్తయ్య బుధవారం పరిశీలించారు. ఆయా కేంద్రాల్లో 100 మంది పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, డాక్టర్లు షాభాజిఖాన్, శంజనేషలు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన

పాలకుర్తి: మండలంలోని కన్నాలలో బుధవారం ఆయిల్‌పామ్ సాగుపై వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఈవో శశిధర్ రైతులకు సాగు విధానం, ప్రభుత్వ సబ్సిడీ గురించి వివరించారు. ఆయిల్‌పామ్ సీఈవో కేశు మాట్లాడుతూ త్వరలో సుల్తానాబాద్ లో ఆయిల్‌పామ్ కంపెనీ నెలకొల్పనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీవో షబ్బీర్‌పాషా, పంచాయతీ కార్యదర్శి రవి, స్థానికులు పాల్గొన్నారు.

కళాశాలలో ఉచిత కంటి మెగా వైద్య శిబిరం

గోదావరిఖనిటౌన్: గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు శ్రీకాంత్ కంటి వైద్యశాల ఆధ్వర్యంలో బుధవారం ఉచిత కంటి మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ ఖాజా జహీర్ అహ్మద్ తెలిపారు.దాదాపు 300 మంది విద్యార్థులకు డాక్టర్ శ్రీకాంత్ వైద్యపరీక్షలను నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో లైఫ్ లైన్ ఆస్పత్రి నిర్వాహకులు లక్కం భిక్షపతి, ఎన్‌సీసీ అధికారి జె.విశ్వనాథ్‌కుమార్, లెక్చరర్ సుబ్బారావు పాల్గొన్నారు.

ఆశ్రమ చిన్నారులతో ప్రేమ పంచుకోవాలి

రామగుండం: ఆశ్రమంలో తలదాచుకుంటున్న చిన్నారుల పట్ల ప్రేమను, ఆప్యాయతను పంచుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ అన్నారు. ఈ మేరకు బుధవారం పట్టణంలోని తబితా ఆశ్రమంలోని చిన్నారులకు సామూహిక జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల సమక్షంలో కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం చిన్నారులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ మగువ అధ్యక్షురాలు సోమారపు లావణ్య, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు రాపోలు కుసుమకుమారి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నేటి పిల్లలే రేపటి పౌరులు

రామగుండం: పట్టణంలోని తబితా ఆశ్రమంలోని చిన్నారులకు బుధవారం సామూహిక జన్మదిన వేడుకలు నిర్వహించగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్‌ఠాకూర్ హాజరై చిన్నారులతో ముచ్చటించి ఒక్కొక్కరికి మిఠాయిలు తినిపించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులున్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళా

గోదావరిఖనిటౌన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలోమెగా జాబ్ మేళా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ ఖాజా జహీర్ అహ్మద్ తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన దాదాపు 12 మల్టీ నేషనల్ కంపెనీల ప్రతి నిధులు నిర్వహించిన ఇంటర్వ్యూలో దాదాపు 270 మంది అభ్యర్థులు హాజరయ్యారు. 96 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వెంటనే నియామక పత్రాలు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ ఆఫీసర్ జి.సుబ్బారావు, టీఎస్‌కేసీ మెంటర్ పి.ఉషారాణి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కోల్‌సిటీ: గోదావరిఖనిలోని కళ్యాణ్‌నగర్, లక్ష్మీనగర్ ఏరియాలో గురువారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని విద్యుత్ శాఖ ఏఈ పెద్దపల్లి కిషన్ తెలిపారు.వినియోగదారులు సహకరించాలని కోరారు.